ప్రజాశక్తి
బుధవారం 17 మే 2023
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి

క్షణక్షణం..భయం భయం

◆ పరిశ్రమల్లో ప్రమాదాలతో ప్రాణాలు పోతున్నాయి ◆ బతికుంటే జబ్బులు వెంటాడుతున్నాయి
◆ ఎల్‌జి పాలిమర్స్, వసుధా ఫార్మా, స్మైలెక్స్, మైలాన్, అరబిందో, ఎస్సెన్స్, అభిజిత్ కంపెనీల్లో మృత్యువాత పడ్డ బాధిత కుటుంబాల ఆవేదన
◆ విశాఖలో 'పారిశ్రామిక మరణాలకు బాధ్యులెవరు ?' రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఫార్మా కంపెనీల్లో కార్మికుల ప్రాణాలకు భద్రత లేకుండా పోతోంది. రియాక్టర్ల నాణ్యతా లోపంతో ప్రమాదం సంభవిస్తే ప్రాణాలు పోతున్నాయి. యాజమాన్యాలను శిక్షించే చట్టాలు వారికి చుట్టాలుగా మారిపోతున్నాయి. ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఇఒడిబి) పేరుతో ఫ్యాక్టరీస్, లేబర్ డిపార్టుమెంట్ అధికారుల చేతులు కట్టేయడంతో యాజమాన్యాల ఆగడాలకు ఆకాశమే హద్దుగా మారిపోయింది. నష్టపరిహారం పేరుతో కుటుంబీకుల ప్రాణాలకు వెలకట్టి యాజమాన్యాలు చేతులు దులుపుకుంటున్నా ప్రభుత్వం బాధ్యతారాహిత్యంతో చోద్యం చూస్తోంది' అంటూ ప్రమాద బాధిత కుటుంబీకులు తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. మంగళవారం విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'పారిశ్రామిక మరణాలకు బాధ్యులెవరు?' అన్న అంశంపై సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి

సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా గుజరాత్‌కు చెందిన పీపుల్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చి సెంటర్ (బరోడా) పర్యావరణ నిపుణులు జగదీష్ పటేల్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమలు, ఫార్మా రంగాల్లో పలు చోట్ల నానాటికీ ప్రమాదాలు పెచ్చుమీరుతున్నాయన్నారు. ఈ ఘటనల్లో కార్మికులు మృత్యువాత పడుతున్నా యాజమాన్యాలు వారిపైనే నిందలు మోపుతూ తప్పించుకుంటున్నాయని తెలిపారు. యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రమాదాలు మిగతా 2లో..

నేడు విశాఖలో చంద్రబాబు పర్యటన

పెందుర్తిలో రోడ్ షో, బహిరంగ సభ

ప్రజాశక్తి - పెందుర్తి



టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు బుధవారం విశాఖలో పర్యటించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు శాంతి కల్యాణ మండపం సమీపంలోని కాస్మో ప్రైమరీ స్కూల్ నుంచి ఆయన రోడ్ షో ఉంటుంది. 6 నుంచి 7 గంటల వరకూ పెందుర్తి కూడలిలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహిస్తారు. దీంతో చంద్రబాబు ప్రసంగిస్తారు. అనంతరం సరిపల్లి గ్రామంలోని చర్చి వెనుక వైపు ఆయన బసకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బహిరంగ సభ విజయవంతానికి ఏర్పాట్లు

'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా పెందుర్తిలో జరిగే బహిరంగ సభకు టిడిపి అధినేత చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం పెందుర్తిలోని 96వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు కార్యాలయంలో రాష్ట్ర నాయకులు కిమిడి కళా వెంకట్రావు, బుద్దా వెంకన్న, బండారు సత్యనారాయణమూర్తి, పీలా శ్రీనివాసరావు తదితరులు సమావేశ మయ్యారు. ఏర్పాట్లుపై సమీక్షించారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ జగన్ హయాంలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్ళిందని, యువత నిరుద్యోగ బాట పట్టిందని అన్నారు. కళా వెంకట్రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శాడిస్ట్ అని, చంద్రబాబు అవినీత రహిత పాలన అందించడం చూసి ఓర్వ లేక ఏదో ఒక కేసులో జైల్లో పెట్టించాలని ఆరాటపడుతున్నాడని విమర్శించారు. పెందుర్తి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మాట్లాడుతూ పేదవారికి 16 వేలకుపైగా టిడ్కో ఇళ్లు ఇచ్చిన ఘనత కేవలం చంద్రబాబు నాయుడుదని పేర్కొన్నారు. పంచ గ్రామాల సమస్యను నాడు చంద్రబాబు హయాంలో ఒక కొలిక్కి తీసుకొచ్చినప్పటికీ వైసిపి ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. పెందుర్తిలో జరిగే సభలో ప్రధానంగా మత్స్యకారుల సమస్యలు, ముదపాక భూముల విషయం, పంచ గ్రామాలు, తాడి గ్రామం తరలింపు, టిడ్కో హౌసింగ్ సమస్యలపై చంద్రబాబు ప్రసంగం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం స్థానిక నాయకులు అవగడ్డ అప్పలనాయుడు, రెడ్డి నారాయణరావు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు రుణాలు పెంచాలి

▶ వార్త 2లో..

క్లాప్ డ్రైవర్ల అక్రమ అరెస్టులు దారుణం

▶ వార్త 2లో..

ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేయండి

▶ వార్త 2లో..

స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ ఎదుట బైఠాయించిన ఉక్కు కార్మికులు

వేతన సవరణ కోసం

ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి

భారీగా తరలివచ్చిన స్టీల్‌ప్లాంట్ కార్మికులు వార్త మెయిన్‌లో..

కొందరికే ఆసరా..!

◆ మూడో విడత సాయానికి ఎదురుచూపు
◆ 13,812 సంఘాలకు అందని నిధులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

వైఎస్ఆర్ ఆసరా కింద మూడో విడత రుణసాయం కోసం 13,812 పొదుపు సంఘాలు ఎదురుచూస్తున్నాయి. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మార్చి 25న రుణమాఫీ సాయం నిధుల జమకు మీట నొక్కితే డ్వాక్రా మహిళలు మురిసిపోయారు. మూడో విడత రుణమాఫీ సాయం నిధులు జమవుతాయని ఆనందపడ్డారు. మూడో విడత ఆర్థిక సాయానికి మార్చి 25న శ్రీకారం చుట్టిన ఆయన ఏప్రిల్ 5 వరకు పొదుపు సంఘాల్లోని మహిళల ఖాతాల్లో జమవుతాయని ప్రకటించారు. కానీ ఇప్పటికీ అన్ని సంఘాలకూ పూర్తిగా నిధులు జమకాలేదు. 2019 ఏప్రిల్ 11 నాటికి పొదుపు సంఘాల మహిళలు తీసుకున్న రుణాలను నాలుగు వాయిదాల్లో చెల్లిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. అందులో భాగంగానే వైఎస్ఆర్ ఆసరా పథకం కింద రెండు దశల్లో రుణమాఫీ నిధులు విడుదల చేశారు. మూడో విడతలో మాత్రం నిర్దేశిత గడువులోగా నిధులు జమచేయలేదు.

జిల్లాలో 39,898 పొదుపు సంఘాల్లో 4,38,704 మంది మహిళా సభ్యులున్నారు. ఈ సంఘాల్లో ఆసరా పథకానికి అర్హత కలిగిన 31,890 గ్రూపులకు మూడో విడత రుణమాఫీ సాయం కింద రూ.248.15 కోట్లు జమచేయాల్సివుంది. ఏప్రిల్ 5 నాటికి అన్ని సంఘాలకూ నిధులు జమచేసే ప్రక్రియ పూర్తిచేస్తామని చెప్పినా.. ఇంతవరకు 18,078 పొదుపు సంఘాలకు రూ.135.15 కోట్లనే ప్రభుత్వం జమచేసింది. ఇంకా 13,812 సంఘాలకు రూ.113 కోట్లు జమచేయాల్సివుంది. జమకాని పొదుపు సంఘాల మహిళలు రుణమాఫీ సాయం ఎప్పుడు జమవుతుందా ? అని ఎదురుచూస్తున్నారు. ఎమ్మెల్యేలను అడుగుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నారు. కానీ నిధులు జమకాకపోవడంతో నిరాశ వ్యక్తం చేస్తున్నారు. చివరకు ఆసరా నిధులురాని పొదుపు సంఘాల మహిళలు 'జగనన్నకు చెబుదాం' కాల్ సెంటర్‌కు 1902 ద్వారా తెలియజేస్తున్నారు. డిఆర్‌డిఎ అధికారులు మాత్రం అర్హతపొందిన పొదుపు సంఘాలన్నింటికీ ఆసరా సాయం అందుతుందని చెబుతున్నారు. సంఘాల మహిళలెవరూ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

క్షణక్షణం..భయం భయం

జరుగుతున్నాయని చెప్పారు. వీటికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఫార్మా కంపెనీల్లో రియాక్టర్ల పని విధానం, వాటి నాణ్యతపై తనిఖీల్లేకుండా ప్రభుత్వ విధానం ఉండడం వల్లే ప్రాణాంతక ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. ఇవి పారిశ్రామిక ప్రమాదాలు కావని, ప్రభుత్వాల హత్యలని పేర్కొన్నారు. విశాఖ, శ్రీకాకుళం జిల్లాకు చెందిన పలు ఫార్మా, ఇతర పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో మృతిచెందిన కుటుంబాలకు చెందిన వారు సదస్సులో పాల్గొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

బాబాయ్ చనిపోయాడు.. నా భర్త అవిటి వాడయ్యాడు : అప్పలనర్సమ్మ

'స్మైలెక్స్ కంపెనీలో ఈ ఏడాది జనవరి 5న జరిగిన ప్రమాదంలో మా బాబాయ్ మేడిశెట్టి పైడిరాజు మృతిచెందారు. నా భర్త వనం అప్పారావు మంచం పట్టాడు. నెలల తరబడి తేరుకోలేని స్థితి ఉంది' అని బాధితురాలు వి.అప్పలనర్సమ్మ ఈ సదస్సులో తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. పై అంతస్తులోకి వెళ్లి పనిచేస్తున్నప్పుడు సరైన రోప్ (తాడు) లేనందున అది తెగి కిందకు వారు పడిపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని వివరించింది.

మరికొందరు..

అభిజిత్ పరిశ్రమలో మే 1న జరిగిన ప్రమాద విషయంలో సిఐటియు చొరవతో యాజమాన్యం దిగివచ్చి రూ.13 లక్షలను బాధిత కుటుంబానికి పరిహారం ఇచ్చిందని ఆర్.రాము వెల్లడించారు. ఎస్సెన్స్‌లో ప్రొక్లెయిన్ మీద నుంచి కింద పడి డ్రైవర్ కాలు తెగిపోయిందని, ప్రస్తుతం నడవలేని స్థితిలో ఉన్నాడని తెలిపారు. ఎల్‌జి పాలిమర్స్ దుర్ఘటన 2020 మే 7న జరిగిందని పేర్కొంటున్నా.. వాస్తవానికి 6వ తేదీ రాత్రి 10 గంటలకే స్టైరీన్ గ్యాస్ లీకేజీ మొదలైందని, అక్కడున్న వ్యక్తి మెయిన్‌టైన్ చేయలేక తప్పించుకుని పారిపోయాడని ఉరుకూటి రాజు వెల్లడించారు. తెల్లవారుజామున 2 గంటలకు వెంకటాపురం గ్రామం అంతా గ్యాస్ లీకై విస్తరించి 15 మంది మృత్యువాతకు దారితీసిందన్నారు. గ్యాస్ పీల్చి వేలాది మంది బాధితులుగా మారారన్నారు. కంపెనీకి వెనుక భాగంలోగల మేఘాద్రి గెడ్డవైపు వేల సంఖ్యలో ప్రజలంతా పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారని, ముందు వైపు వెళ్లిన వారంతా గ్యాస్ పీడితులై నేటికీ రోగాల బారిన పడుతూ అవస్థలతో జీవనం సాగిస్తున్నారని ఆయన వివరించారు. ఎల్‌జి.పాలిమర్స్ ఘటనానంతరం నేటికీ పిల్లలకు తల వెంట్రుకలు ఊడిపోతున్నాయని, పెద్దవాళ్లకు కీళ్లనొప్పులు, ఆయాసం తరచూ వస్తున్నాయని అన్నారు. అచ్యుతాపురం వసుధా ఫార్మా కంపెనీలో తన తమ్ముడు ఫిట్టర్‌గా చేరి గత ఏప్రిల్‌లో 50 అడుగుల పై నుంచి కిందపడిపోవడంతో మృతిచెందాడని, యాజమాన్యం సాయంత్రం వరకూ తమకు సమాచారం ఇవ్వలేదని పైగా భద్రతా సూట్ వేసుకోనందునే మృతిచెందాడని నిందారోపణ చేసిందని రూప సభలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మనిషే లేనప్పుడు పరిహారం పేరుతో ఎన్ని లక్షలు యాజమాన్యం ఇచ్చినా ఏం ఉపయోగం ఉంటుందని ఆమె తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సిఐటియు ఈ విషయంపై అవిశ్రాంత పోరాటం చేయబట్టే యాజమాన్యం దిగివచ్చిందని చెప్పారు.

కొందరికే ఆసరా..!

ఆందోళన చెందవద్దని అంటున్నారు.

అంకెల్లో ఇలా..

జిల్లాలో స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జి) : 39,898
మహిళా సభ్యులు : 4,38,704
ఆసరాకు అర్హతపొందిన సంఘాలు : 31,890
సభ్యులు : 3,33,367, నిధులు : 248.15
ఆసరా పొందిన సంఘాలు : 18,078
నిధులు : రూ.135.15 కోట్లు
ఆసరా రావాల్సిన సంఘాలు : 13,812
నిధులు : రూ.113 కోట్లు

ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ డిపిఆర్ మార్చాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఫిషింగ్ హార్బర్ అభివృద్ధికి రూ.152 కోట్లతో రూపొందించిన డిపిఆర్ మత్స్యకారులకు ఏమాత్రమూ ఆమోదయోగ్యం కాదని, దాన్ని తక్షణం మార్చాలని మత్స్యకార ఐక్యవేదిక నాయకులు స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న వేలం షెడ్డును ఉన్న చోటనే అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని, వేలం షెడ్డు - 2 పేరుతో మరో చోట వేలం షెడ్‌ను అభివృద్ధి చేయడం తమకు ఏమాత్రమూ ఆమోదయోగ్యం కాదని అన్నారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మత్స్యకార ఐక్యవేదిక కన్వీనర్ చీకటి రమేష్, గంగా గౌరీ భవాని ఫిషింగ్ హార్బర్ చేపల వేలం పాటల సంఘం అధ్యక్షుడు మూగి రాజు, మత్స్యకార సంఘం నాయకులు కె.చంద్రశేఖర్, వైశాఖి ఫిష్ ట్రేడర్స్ అధ్యక్షులు గుంటు ఆనంద్, కార్యదర్శి వాసుపల్లి దాసు, ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడారు. డిపిఆర్‌ను మత్స్యకారుల అభిప్రాయం మేరకు మార్పు చేయాలన్నారు. స్లిప్ వే కాంప్లెక్స్‌లో కొత్తగా నేచురల్ బీచింగ్ పాయింట్ ఏర్పాటు చేసి బోట్లు పైకి లాగేందుకు క్రేన్, 8 ట్రాలీల సదుపాయం కల్పించాలన్నారు. ఫ్లోటింగ్ జెట్టీలు వద్దన్నారు. చేపల వర్తకం చేసే ఫిష్ ట్రేడర్లకు కనీసం ప్యాకింగ్ చేసుకునే వసతి కల్పించాలన్నారు. డిమాండ్లను నెరవేర్చకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

భవన నిర్మాణ కార్మికుల జీవితాలతో జగన్ చెలగాటం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : భవన నిర్మాణ కార్మికుల జీవితాలతో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ అన్నారు. మంగళవారం చలో కలెక్టరేట్ కార్యక్రమానికి వారు సిద్ధపడగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పోలీసులు కార్మికులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

క్లాప్ డ్రైవర్ల అక్రమ అరెస్టులు దారుణం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విధి నిర్వహణలో ఉన్న క్లాప్ డ్రైవర్లు 23 మందిని పోలీసులు అక్రమంగా నిర్బంధించి, అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఫోర్త్ టౌన్ స్టేషన్ ఎదుట జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. జోన్ 4, 5 పరిధిలో అరెస్టు చేసిన 23 మంది క్లాప్ డ్రైవర్లను తక్షణం విడుదల చేయాలని, వారిపై పెట్టిన తప్పుడు కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు జీవో ప్రకారం రూ.18,500 జీతాలు చెల్లించాలని నినదించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న క్లాప్ డ్రైవర్లను అరెస్టు చేసే అధికారం పోలీసులకు ఎక్కడిదని ప్రశ్నించారు. క్లాప్ డ్రైవర్లు చేసిన తప్పు ఏమిటని అడిగారు. జీవో 7 ప్రకారం రూ18,500 జీతాలు ఇవ్వాలని అడగడం నేరమా అన్నారు. ఆప్కాస్‌లో పనిచేస్తున్న డ్రైవర్లకు రూ.18,500 జీతం చెల్లిస్తున్నారని, వారు చేస్తున్న పనులనే క్లాప్ డ్రైవర్లు కూడా చేస్తున్నారని చెప్పారు. జివిఎంసి ఆధ్వర్యంలో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం చెల్లించాల్సి ఉండగా,

పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేపడుతున్న జివిఎంసి కార్మికులు

కాంట్రాక్టర్ రూ.12,000 మాత్రమే చెల్లిస్తున్నారని, రకరకాల పేర్లు చెప్పి రూ.2 వేల వరకు కోత విధిస్తున్నారని తెలిపారు. రూ.10 వేలతో క్లాప్ డ్రైవర్ల కుటుంబాలు ఎలా జీవిస్తాయని ప్రశ్నించారు. తప్పు చేసింది కాంట్రాక్టరు కనుక ఆయనపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన వారందరినీ తక్షణం విడుదల చేయాలని, వారిపై పెట్టిన కేసులు రద్దు చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు రుణాలు పెంచాలి

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు ఇచ్చే రుణాలను, టిడ్కో హౌసింగ్‌కి ఇచ్చే రుణాలను మరింత పెంచాలని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు కోరారు. మంగళవారం దశపల్లా హోటల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యత రంగానికి బ్యాంకర్లు ఇవ్వాల్సిన రుణాలు వాటి లక్ష్యాల కంటే తక్కువగా

సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి

ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ బ్యాంకులు రుణాలు తక్కువగా ఇస్తున్నాయని, కౌలు రైతులకు లోన్ పెంపుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నప్పటికీ ఇంకా ఆశించిన స్థాయిలో ఫలితాల దిశగా ప్రైవేట్ బ్యాంకుల ప్రయత్నం లేదని అన్నారు.

కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగత్ కిషన్ రావు కరాడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, ఫైనాన్స్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శంషేర్ సింగ్ రావత్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మునిస్వామి

వడగాల్పులపై అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రస్తుత ఎండాకాలంలో వడగాల్పులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని విశాఖపట్నం సహాయ కార్మిక కమిషనర్ సర్కిల్ -2 బుద్ధ మునిస్వామి అన్నారు. మంగళవారం కార్మిక అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా ఆయన సమావేశమయ్యారు. సంస్థల, దుకాణాల యజమానులు వడగాలులపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అవకాశం ఉన్న మేరకు పని దినాలలో సమయ మార్పులు చేయాలని సూచించారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా పని చేసే చోట్ల సేద తీర్చుకోవటానికి షెడ్లు, చలువ పందిర్లు ఏర్పాటు చేయాలని, ఆరోగ్య శాఖ సిబ్బందితో సంప్రదింపులు చేస్తూ ఉండాలని ఆదేశించారు. ప్రతి 15 నుంచి 20 నిమిషాల వ్యవధిలో గ్లాస్ మంచి నీరు, మజ్జిగ లేదా ఒఆర్ఎస్ అందుబాటులో ఉండేవిధంగా సంస్థ యజమానులు ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు పని చేసే చోట ఐస్ పాక్స్ సిద్ధంగా ఉండాలన్నారు.

ప్రతి యజమాని తమ సంస్థలో అంబులెన్స్‌ను అందు బాటులో ఉంచుకోవాలన్నారు. అసంఘటిత కార్మికులను ఈ-శ్రమ నమోదు, వైఎస్ఆర్ బీమా నమోదు ఎలా చేయాలో వివరించారు. గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న భవన నిర్మాణ కార్మికులు ఇంతవరకు ఆధార్‌కు అను సంధానం చేయకుంటే వారు అక్కయ్య పాలెంలోని కార్మిక శాఖ కార్యాలయానికి వచ్చి అనుసంధానం చేసుకోవాలన్నారు.

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S.No. 750 of 2022

Between:
Bank of Baroda, NAD Kotha Road Branch, Represented by its Authorized Signatory ... Plaintiff
And:
Sri. Injumuri Uday Bhanu ...Defendant

To,
1. Sri Injumuri Uday Bhanu
S/o. Sri Srinivasa Rao,
Hindu, aged 30 years,
Residing at D.No. 57-27-321
Srirama Nagar, Near IT Junction,
Visakhapatnam - 530 007.

NOTICE

Please take notice that the above suit is filed by the plaintiff for Recovery of amount and other reliefs. All these are stand posted to **19-06-2023** for your appearance on which date, you are required to appear before the above Hon'ble Court either in person or through your advocate at **10-30 A.M.** failing which you will be set exparte and the matter will be decided in your absence on merits.

(By Order)
SRINIVAS AJJARAPU
Advocate, 29-2-39,
Near District Court,
Visakhapatnam

ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. మంగళవారం ఆమె విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనా థియేటర్లో జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మతో కలిసి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం మున్సిపల్ స్కూల్‌లో పదో తరగతిలో 500 పై మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డులను, ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలలో మంచి మార్కులు రావడం అభినందనీయమన్నారు. జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ కష్టపడి చదివి మంచి మార్కులు సాధించడమే తొలి విజయమని అన్నారు. రాష్ట్రంలో విశాఖ జిల్లాకు మూడో స్థానం రావడం ఆనందంగా ఉందన్నారు.

ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : 2018లో నూతనంగా డిఎస్‌సి ద్వారా ఎంపికైన హిందీ, సోషల్ ఉపాధ్యాయులకు స్థానిక ప్రైవేట్ హైస్కూల్ క్యాంపస్‌లో మంగళవారం శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతులను డిఇఒ ఎల్.చంద్రకళ ప్రారంభించారు. నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన వారు విద్యార్థుల భవిష్యత్ నిర్మాణం కోసం ఎలా కృషి చేయాలన్నదీ ఆమె వివరించారు. నూతన విద్యా విధానం -2020పై అవగాహన కల్పించారు. పాఠ్య ప్రణాళిక నిర్మాణం, పాఠ్యాంశాల పట్ల అవగాహన కల్పించారు. ఈ నెల 19వ తేదీ వరకు ఈ శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. ఎస్‌సిఇఆర్‌టి పరిశీలకులు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ, ఈ తరగతుల్లో ఉపయుక్తమైన పద్ధతులను నేర్చుకొని, సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.

మాట్లాడుతున్న డిఇఒ చంద్రకళ

రీసోర్స్‌పర్సన్ టిఎస్‌వి.ప్రసాదరావు, ఎంవివిఎస్.బలరామ్మూర్తి, సంపత్ మధుమతి, ఝాన్సీ పాల్గొన్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ఉపాధ్యాయులు శిక్షణా తరగతులకు హాజరయ్యారు

గురుకులంలో 20న ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఏపి గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికిగాను ఈ నెల 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్, స్థానిక ప్రిన్సిపల్ కోడి రాంబాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాలల్లో 5 నుంచి 8వ తరగతుల్లో ప్రవేశానికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రవేశ పరీక్ష అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించి అభ్యర్థులు హాల్ టిక్కెట్లు https//aprs.apcfss.inవెబ్‌సైట్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. హాల్ టిక్కెట్లు పోస్ట్ ద్వారా పంపబడవని స్పష్టం చేశారు. తమకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని అభ్యర్థులకు సూచించారు.

నాడు - నేడు పనులు పూర్తిచేయాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : నాడు, నేడు పథకం కింద ఇప్పటికే పలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించిన పనులు త్వరగా పూర్తిచేయాలని ఎంఇఒ కెవి.బాలామణి, సమగ్ర శిక్ష డిఇ నరసింహారావు ఆదేశించారు. జివిఎంసి 4వ వార్డు మంగమారిపేట, మండలంలోని తాళ్లవలస, చిప్పాడ, అమనాం జెడ్పీ హైస్కూళ్లు, పలు ప్రాథమిక, యుపి పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను మంగళవారం సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. తరగతి గదులు, మరుగు దొడ్లు, ప్రహరీ నిర్మాణ పనులు, తాగునీరు, విద్యుత్, గ్రీన్ బోర్డులు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు. జూన్ 12న పాఠశాలల పున:ప్రారంభానికి ముందే పనులు పూర్తిచేయాలని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. ఇందుకు హెచ్‌ఎంలు చొరవ తీసుకోవాలని కోరారు. ఈ నెల 18వ తేదీన విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పర్యటన ఉండే అవకాశం ఉందని, రికార్డులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పలువురు హెచ్‌ఎంలు, ఎఇ మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఎయుకు ర్యాంక్ పట్ల హర్షం

ప్రజాశక్తి -విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం అఖిల భారత స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్‌ని సాధించడం పట్ల నగర మేయర్ జి.హరి వెంకట కుమారి సంతోషం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలపై ప్రచారం

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -తగరపువలస : ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలపై 'జగనన్న బడి బాట'లో భాగంగా మంగళవారం జివిఎంసి ఒకటో వార్డు పరిధి చిట్టివలస డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.పద్మావతి, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, రమేష్, ఇందిర తదితరులు స్థానిక సంతపేట ఏరియాలో ప్రచారం చేశారు. ఈ మేరకు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఇదే పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న జి.దుర్గాప్రసాద్ తన కుమార్తె తన్విశ్రీని ఈ పాఠశాలలో చేర్పించారని హెచ్‌ఎం తెలిపారు. ఇప్పటికే అతని పెద్ద కుమార్తె దుర్గా మహిమ శ్రీ ఇదే పాఠశాలలో చదువుతున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యా పరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లు పూర్తిచేయాలంటూ ధర్నా

ప్రజాశక్తి- భీమునిపట్నం : జగనన్న ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని కోరుతూ జివిఎంసి 4వ వార్డు సచివాలయం ఎదుట పలువురు లబ్ధిదారులు మంగళవారం ధర్నా నిర్వహించారు. నిర్ణీత వ్యవధిలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకుంటే ఇళ్లు రద్దవుతాయని హౌసింగ్, సచివాలయ అధికారులు చెప్పి ఒత్తిడి చేయడంతో అధిక వడ్డీలకు అప్పులు చేసి, ఇళ్ల నిర్మాణం ప్రారంభించామని లబ్ధిదారులు వాపోయారు. సంబంధిత స్థలంలో వివాదం ఉన్నందునే ఇళ్ల నిర్మాణాలు నిలిపివేస్తున్నట్లు అధికారులు చెప్పడం ఏ మేరకు సబబని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్థల వివాదాన్ని పరిష్కరించి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సచివాలయానికి చెందిన సంబంధిత అధికారులకు, లబ్ధిదారులకు మధ్య వాగ్వివాదం జరిగింది.

కె నగరపాలెం సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్న జగనన్న ఇళ్ల లబ్ధిదారులు

నేటికీ అందని జీతాలు

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి-మధురవాడ : రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో వివిధ కేడర్లలో పనిచేస్తున్న సుమారు 23వేల మందికి నేటికీ జీతాలు ఇవ్వలేదని, ఎలా బతకాలని ఎన్‌హెచ్‌ఎం జెఎసి విశాఖ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. నిత్యావసరాలు కొనుగోలు, ఇంటి అద్దెల చెల్లింపులు, ఇతరత్రా అవసరాలు ఎలా తీర్చుకోవాలని ప్రశ్నించారు. పిల్లలకు సెలవులు ఇచ్చినా డబ్బులు లేక వారిని ఎక్కడికీ తీసుకెళ్లలేకపోతున్నామని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. త్వరగా జీతాలు అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కిక్ బాక్సింగ్‌లో పతకాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆంధ్రా యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 13, 14 తేదీల్లో జరిగిన ఏపి కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని రేఖవానిపాలెం పంచాయతీకి చెందిన బి.సాయి, చరణ్‌లకు రెండు బంగారు పతకాలు, కె.శ్యామ్, సత్య, వశిష్టలకు బంగారు, రెండు వెండి పతకాలు లభించాయని సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు తెలిపారు. కోచ్ కె.చిట్టిబాబును, పతకాలు సాధించిన వారిని సర్పంచ్ అభినందించారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని కోలవానిపాలెం గ్రామానికి చెందిన గండ్రెడ్డి దారయ్య ఈనెల 13 నుంచి కనిపించడం లేదని అతని అన్నయ్య గౌరీస్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... గండ్రెడ్డి దారయ్య (26) పెందుర్తి గొల్లపల్లి గ్రామంలో జెసిబి డ్రైవర్‌గా నాలుగేళ్ల నుంచి పనిచేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 7:30 గంటలకు డ్యూటీకి వెళ్లి సాయంత్రం 6:30 గంటలకు ఇంటికి వస్తుంటాడు. ఈ నెల 13వ తేదీ ఉదయం 7:30 గంటలకు డ్యూటీకి వెళ్లాడు. సాయంత్రం 6:30 గంటలకు డ్యూటీ నుంచి ఇంటికి బయలుదేరినట్లు అక్కడి వారు చెబుతున్నారు. కానీ ఇంతవరకు ఇంటికి చేరలేదు. అన్ని చోట్లా వెతికినా ఆచూకీ లేకపోవడంతో అన్నయ్య గౌరీస్ ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

17 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- ఎస్.రాయవరం : మండలంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్ ఐ ప్రసాదరావు తెలిపారు. మంగళవారం ఉదయం రేలుగుంట మండలం బెన్న భూపాలపట్నం గ్రామానికి చెందిన పాకల పరుశురాం, మల్లెపాటి గణేష్ స్కూటీపై 17 కిలోల గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వీరి నుండి స్కూటీతో నాలుగు సెల్ ఫోన్లు, రూ. 21వేలు నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్ ఐ ప్రసాదరావు తెలిపారు.

ఇద్దరు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలో కాశీపురం గ్రామ సమీపంలో బహిరంగ ప్రదేశంలో పేకాట శిబిరాలపై ముందస్తు సమాచారం మేరకు మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.470 నగదును స్వాధీనం చేసుకొని, పేకాట ఆడుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండు తరలించినట్లు దేవరాపల్లి ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

బ్లూఫ్లాగ్‌తో తీర ప్రాంతాలకు గుర్తింపు

ప్రజాశక్తి-మధురవాడ : రుషికొండ తీరానికి బ్లూఫ్లాగ్ లభించడం పర్యాటకులను మరింతగా ఆకర్షించగలదని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్రవిభాగం, ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి శాఖ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన సదస్సులో నిపుణులు పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ మాట్లాడుతూ, 1987 సంవత్సరంలో యూరప్‌లో బ్లూఫ్లాగ్ మొదటి సారిగా ప్రారంభించారని, తదనంతర కాలంలో దాదాపు 48 దేశాలలో ఐదు వేలకుపైగా బీచ్‌లకు బ్లూఫ్లాగ్ గుర్తింపు లభించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఇంజినీర్ డాక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి శాఖ ప్రాంతీయ డైరక్టర్ డాక్టర్ శ్రీనివాసఫణి తన ప్రసంగంలో తీరప్రాంత పర్యాటకం అభివృద్ధిలో బ్లూఫ్లాగ్ ప్రాధాన్యతను వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి, పర్యావరణ శాస్త్రవిభాగం అధిపతి డాక్టర్ వి.సరిత, కన్వీనర్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు.

టెన్త్ విద్యార్థులకు మేయర్ అభినందన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జివిఎంసి ఉన్నత పాఠశాలకు చెందిన ప్రతిభ కనబరిచిన ఏడుగురు టెన్త్ విద్యార్థులను మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిఇఒ ఎల్.చంద్రకళ అభినందించారు. టెన్త్‌లో 500 పైబడి మార్కులు సాధించిన విద్యార్థులను నగరంలోని వియంఆర్‌డిఎ చిల్డ్రన్ థియేటర్‌లో అభినందించారు. అభినందనలు పొందిన విద్యార్థుల్లో ఎ.విజయ (565), వై.అనిత (531), ఎం.త్రిలోచన (529), పి.అనూష (516), కె.రాకేష్ (512), ఎ.రామకృష్ణ (508), ఎం.అనీల్ (510) ఉన్నారు. అభినందన కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు


విద్యార్థిని అభినందిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, డిఇఒ చంద్రకళ

మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చీకటి సత్యనారాయణ

మజ్జిగ చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్ పాత ఆర్‌టిఎ కార్యాలయం వద్ద పరిశ్రమ యజమానుల ఆధ్వర్యాన మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం ఐలా సెక్రెటరీ చీకటి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ చలివేంద్రం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

రేవిడిలో...

పద్మనాభం : రేవిడి గ్రామంలో మంగళవారం మజ్జిగ చలివేంద్రాన్ని రేవిడి యువజన సేవా సంఘం ఆధ్వర్యాన ప్రారంభించారు. ఆనందపురం మండలం గోట్టిపల్లి గ్రామానికి చెందిన బిఎస్‌ఎన్ పాల డైయిరీ, మరో వ్యక్తి సహకారంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పతివాడ ఇంద్రరావు, ఉపాధ్యక్షులు మరగడ శ్రీనివాసరావు, సంఘం మెంబర్లు రెడ్డి శ్రీను, వెంకటేష్, మధుసూదనరావు, దానయ్య, ఎంపిటిసి సూరప్పుడు, వైసిపి నాయకులు కోన రమణ, విశ్రాంత ఎంపిడిఒ బాపిరాజు పాల్గొన్నారు.

షెడ్యూల్ కులాల కమిషన్ చైర్మన్ ప్రసాద్‌ను కలిసిన సంఘ సభ్యులు

ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి- ములగాడ : హిందుస్థాన్ షిప్ యార్డ్ ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యుల్డ్ కులాల కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్‌ప్రసాద్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పెండింగ్‌లో ఉన్న సమస్యలపై వినతిపత్రం అందించారు. ప్రధానంగా ఎల్ అండ్ ఎం సిరీస్, ప్రమోషన్ పాలసీ సమస్యలపై చర్చించినట్లు సంఘం నాయకులు తెలిపారు. షిప్‌యార్డ్‌ను సందర్శించి యాజమాన్యంతో చర్చించడానికి కమిషనర్ సముఖత వ్యక్తంచేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ కె.అప్పలకొండ, సెక్రటరీ కె.అనీల్‌కుమార్, పి.అనీల్‌కుమార్, పి.పవన్‌కుమార్, ఎ.కొండలరావు, ఎ.సత్యనారాయణ, ఎస్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభచూపిన విద్యార్థులకు జియ్యాని అభినందనలు

ప్రజాశక్తి-వేపగుంట : ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని 10వ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, కార్పొరేట్ విద్యాసంస్థలలో చదువుకున్న వారికి దీటుగా మార్కులు సాధించిన విద్యార్థును సత్కరించటం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు చూస్తారన్నారు. మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులు మరిన్ని ఉన్నత చదువులు అభ్యసించాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

కన్నారావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిహెచ్.నర్సింగరావు, జగ్గునాయుడు, కెఎం.శ్రీనివాస్, రామారావు తదితరులు

కన్నారావుకు సిపిఎం, సిఐటియు నివాళి

ప్రజాశక్తి-ఉక్కునగరం : అనారోగ్యంతో సోమవారం మృతిచెందిన సిఐటియు సీనియర్ నాయకులు ఉప్పిలి కన్నరావుకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఎన్.రామారావు నివాళులర్పించారు. మంగళవారం ఉదయం అగనంపూడిలోని కన్నారావు నివాసంలో ఏర్పాటుచేసిన సంతాప సభకు హాజరై విప్లవ వందనాలు తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, కార్మిక హక్కుల పరిరక్షణకు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల, నిర్వాసితుల హక్కుల కోసం కన్నారావు అనేక పోరాటాలలో పాల్గొన్నారని గుర్తుచేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉద్యమంలో సైతం అగనంపూడి నుంచి నిర్వాసితులను కదిలించి పోరాటాలను విజయవంతం చేశారని తెలిపారు. కన్నారావు మృతి పార్టీకి తీరని లోటఅన్నారు. ఆయనకు సిపిఎం, సిఐటియు తరపున నివాళులర్పించారు.

సనపల నాగరాజుకు నివాళి

మాధవధారలో సంతాప సభ

ప్రజాశక్తి -మాధవధార : జనవిజ్ఞాన వేదిక, యుటిఎఫ్‌లో పనిచేసి కరోనాతో మృతిచెందిన సనపల నాగరాజు ద్వితీయ వర్థంతిని మాధవధారలో ఘనంగా నిర్వహించారు. నాగరాజు చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు సనపల ఆంజనేయులు, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్టీల్‌ప్లాంట్ సిఐటియు నాయకులు కూన వెంకటరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు సనపల ఆంజనేయులు మాట్లాడుతూ, మూఢ నమ్మకాలను వీడనాడి సైన్స్‌నే నమ్మాలని ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి నాగరాజు చేసిన కృషి మరువలేనిదన్నారు. నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకించి యుటిఎఫ ఆధ్వర్యాన పోరాటాలు నిర్వహించాలని తెలిపారు. నాగరాజు కరోనాతో మృతి చెందడం బాధాకరమనానరు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.సుధాకర్‌రావు, సనపల రామ్‌గోపాల్‌రావు, పప్పల రామచంద్రరావు, కూన సత్యనారాయణ, బొట్టా నరసింగరావు ట్రస్ట్ కార్యదర్శి బుజ్జీ, యుటిఎఫ్ నాయకులు అప్పారావు, పి.పాండురంగారావు, ఎస్‌కె.స్వామినాయుడు, బాబు, పి.శ్రీదేవి, కె.జనార్ధనమ్మ, కె.పార్వతి, ప్రజానాట్యమండలి నాయకులు గుర్రం రమణ తదితరులు పాల్గొన్నారు.

నాగరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆంజనేయులు, ప్రసాద్

ఫార్మాసిటీ నిర్వాసితులకు పట్టాల పంపిణీ

ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఫార్మాసిటీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఫార్మాసిటీ నిర్వాసితులకు పట్టాలను ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి మంగళవారం పంపిణీచేశారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ఎపిఐఐసి, ఫార్మా సిటీ, హౌస్ కమిటీ సమస్యలు గాజువాకను దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్నాయని తెలిపారు. ఈ సమస్యలకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యాన పరిష్కార మార్గం దొరకడం ఆనందంగా ఉందన్నారు. ఈ జటిలమైన సమస్యలు తన వద్దకు వచ్చినప్పుడు పరిష్కారం ఎక్కడ ఉందో పరిశీలించి సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారమైందని తెలిపారు. 20 వేల స్థల పట్టాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ద్వారా పంపిణీచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఫార్మాసిటీతో పాటు ఎపిఐఐసి భూ నిర్వాసితులకు సైతం పట్టాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పరవాడ ఫార్మాసిటీ నిర్వాసితులకు తొలి విడత 134 మందికి, మేజర్ సన్స్‌లో కొంత మందికి పట్టాల పంపిణీకి అవరోధం ఏర్పడిందని తెలిపారు. కొంతమంది లోకాయుక్తను ఆశ్రయించిన కారణంగా పట్టాల పంపిణీకి అవరోధం ఏర్పడిందని వివరించారు. వీటన్నింటినీ పరిష్కరించి త్వరలోనే మిగిలిన వారందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నిర్వాసిత కాలనీకి శ్మశాన వాటికను త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, విశాఖ ఆర్డీవో హుస్సేన్, ఏపీఐఐసీ ఎస్‌డిసి అనిత, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకటరామయ్య, పంచకర్ల రమేష్‌బాబు, స్థానిక కార్పొరేటర్లు సుజాత, వరలక్ష్మి, బొడ్డు నరసింహపాత్రుడు, తిప్పల దేవన్‌రెడ్డి, ఇళ్లపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పరదేశమ్మ పండగ

ప్రజాశక్తి-సీతమ్మధార : శివశంకర్‌నగర్, రజకకాలనీ పరిసర గ్రామ ప్రజలు శ్రీపరదేశమ్మ పండుగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యాన తెల్లవారు జామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన చేశారు. అనంతరం భక్తులకు అమ్మవారు దర్శనం కల్పించారు. సాయంత్రం అమ్మవార్ల ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి వీదుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ఆయా కాలనీల ప్రజలు అమ్మవారిని దర్శించుకొని పసుపు, కుంకమలు సమర్పించుకున్నారు. సాయంత్రం మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, కాలనీ వాసులు బాలకృష్ణ, ఆలయ కమిటీ ప్రతినిధులు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ముగిసిన పెయింటింగ్ వర్క్‌షాపు

ప్రజాశక్తి-సీతమ్మధార : బాల వికాస ఫౌండేషన్, ఫెవికాల్ కంపెనీ సహకారంతో సీతమ్మధారలోని శ్రీకృష్ణ మందిరంలో నిర్వహించిన ఉచిత ఫాబ్రిక్ పెయింటింగ్ వర్క్ షాప్ మంగళవారంతో ముగిసింది. శిక్షణలో పాల్గొన్న వారికి సంస్థ వ్యవస్థాపక గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవి సెలవుల్లో తమకిష్టమైన అంశంపై పట్టు సాధించాలని, అందుకు ఇటువంటి శిక్షణ శిబిరాలు దోహద పడతాయని తెలిపారు. శిక్షణ శిబిరం డైరెక్టర్ యామిని మాట్లాడుతూ, సుమారు 30 మంది శిబిరంలో పాల్గొన్నారని, వారికి పెయింటింగ్‌లో మెళకువలు నేర్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, డాక్టర్ బాబ్జీ, మహాలక్ష్మి, సుధ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులతో..

జాబ్ మేళాలో 106 మంది ఎంపిక

ప్రజాశక్తి -మాధవధార : వైజాగ్ మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యాన మాధవధార ఉడా కాలనీలోని శ్రీపాద డిగ్రీ కాలేజీలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 106 మంది ఎంపికయ్యారు. డబల్ యు ఎన్ హెస్, దక్కన్ ఫైన్ కెమికల్స్, ఎస్‌బిఐ కార్డ్స్, డీల్స్ ఆఫ్ లోన్, శ్రీనిధి అసోసియేట్స్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరై విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. శ్రీపాద డిగ్రీ కాలేజీకి చెందిన 306 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఎంపికైన 106 మంది విద్యార్థులకు శ్రీపాద డిగ్రీ కాలేజ్ కరస్పాండెంట్ కె.శ్రీనివాస్, ప్రిన్సిపల్ డి.రాజేష్ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ ఎస్.శ్రీకాంత్, పి.కార్తీక్, మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు కె.రాజు, ఎ.స్వాతి, వి.దివ్య, వివిధ కంపెనీల ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆర్ట్స్,కామర్స్ కళాశాల హాస్టల్స్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని చీఫ్ వార్డెన్ డాక్టర్ జి.వీర్రాజు అన్నారు. హాస్టల్ కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ప్రధానంగా మెస్ పరిసరాలలో, ఆహారం తయారీ ప్రాంతంతో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

వైఎస్ఆర్ మత్స్యకార భరోసా విడుదల

విశాఖ జిల్లాలో రూ.12.17 కోట్లు, అనకాపల్లి జిల్లాలో రూ.11.37 కోట్ల జీవన భృతి పంపిణీ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ

సముద్రంలో చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారుల జీవన భృతి నిమిత్తం వైఎస్ఆర్ మత్స్యకార భరోసా కింద మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జగదు జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మంగళవారం చేపట్టారు. విశాఖ కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి విశాఖ జిల్లాలో మత్స్యకార భరోసా కింద రూ.12,17,30,000 మెగా చెక్కును మత్స్యకారులకు అందజేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ విశాఖ జిల్లాలో 12,173 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.10,000 చొప్పున జీవన భృతి పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయ, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌ఛార్జి పూర్ణిమ దేవి, ఫిషరీస్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పి.విజయ చంద్ర, పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లాలో రూ.11.37 కోట్ల మత్స్యకార భరోసా

అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో ఎంపికైన 11,373 మంది మత్స్యకార లబ్ధిదారులకు రూ.11.37 కోట్లు మత్స్యకార భరోసా చెక్కును కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సముద్రంలో చేపల వేట నిషేధం సమయం ఏప్రిల్ 15 నుండి జూన్ 14 కాలంలో ఆర్థిక ఇబ్బందులు లేకుండా అర్హులైన కుటుంబానికి రూ.10 వేలు చొప్పున సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. పరవాడ మండలంలో 868 మందికి రూ.86.80 లక్షలు, అచ్యుతాపురంలో 1825 మందికి రూ.182.50 లక్షలు, రాంబిల్లిలో 1306 మందికి రూ.130.60 లక్షలు, ఎస్.రాయవరంలో 2478 మందికి రూ.247.80 లక్షలు, నక్కపల్లిలో 1883 మందికి రూ.188.30 లక్షలు, పాయకరావుపేటలో 3013 మందికి రూ.301.30 లక్షలు లబ్ధి చేకూరుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖాధికారి లక్ష్మణరావు, మత్స్య శాఖ సిబ్బంది, మత్స్యకార ప్రతినిధులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, చిత్రంలో అధికారులు, మత్స్యకారులు

తాము తయారు చేసిన ప్రాజెక్టుకు చూపుతున్న విద్యార్థులు

చెత్త నుంచి విద్యుత్తు తయారీ ప్రాజెక్టు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి జిల్లా దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజ్ పాలిటెక్నిక్ ఈఈఈ మూడవ సంవత్సరం విద్యార్థులు చెత్త మండించడం ద్వారా విద్యుత్తుత్పత్తి ప్రాజెక్టును రూపొందించినట్లు ప్రాజెక్టు ఇంజనీర్ బి.శేషగిరిరావు తెలిపారు. మనకు నిత్యజీవితంలో చెత్త ఒక భాగమైందని, ఈ చెత్త వలన పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని, ఈ సమస్యకు పరిష్కారంగా చెత్తను మండించడం ద్వారా కరెంట్ ఉత్పత్తి చెయ్యాలనే ఆలోచనతో విద్యార్థులు ఒక పరికరాన్ని తయారు చేశారని తెలిపారు. ఈ పరికరం తయారు చెయ్యడానికి కేవలం వెయ్యి రూపాయలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. జె.శివ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆడారి మణికంఠ, సుస్మిత, బాషా, అంజలి, గొర్లి పవన్ కుమార్, గంటకోరు వాసు, గొంతిన లీల, మోహన్, ఐ సంజీవ వర్మ చేసినట్లు వెల్లడించారు. ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ చల్లా నరసింహం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, హెచ్ఓడి గోపాలమ్మ అభినందించారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : జీవీఎంసీ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి) అనకాపల్లి జోన్ గౌరవాధ్యక్షులు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. అనకాపల్లి జోన్ కార్యాలయంలో మంగళవారం గుమస్తా నాగేశ్వరరావుకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీలో వివిధ విభాగాలలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వారు ప్రమాదాలు, అనారోగ్య కారణంగా మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబాలకు ఎటువంటి ఆర్థిక సాయం అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ఐసి లేదా ఇతర ఇన్సూరెన్స్ కంపెనీలకు కార్మికుల తరపున జీవీఎంసీ ద్వారా ఇన్సూరెన్స్ పాలసీ డబ్బు చెల్లించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వాయిబోయిన శేఖర్, కార్మికులు జలగడుగుల శివ కుమార్, కనక రాజు,శ్యామ్, బి. శ్రీను, చిరంజీవి, రవి కుమార్, సన్యాసిరావు, సతీష్, జయరాం, గంగరాజు పాల్గొన్నారు.

ఠాగూర్ ఫార్మాలో అస్వస్థతకు గురై వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పరవాడ

మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ ఫార్మాసిటీలోని ఠాగూర్ లాబొరేటరీ పరిశ్రమలలో సోమవారం బీహార్ రాష్ట్రానికి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు శంకర్ దాస్ (45) తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. సదరు కార్మికుడు అనారోగ్యంతో మృతి చెందినట్లు కంపెనీ యాజమాన్యం పోలీసులు తెలియజేసింది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పరవాడ సిఐ పి ఈశ్వరరావు తెలిపారు. కార్మిక కుటుంబానికి న్యాయం చేయాలని ఫార్మసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గతంలో మైలాన్ యూనిట్-9లో ఎం.శ్రీను చనిపోగా, సోమవారం ఠాగూర్ పరిశ్రమలో కార్మికుడు చనిపోయారని, వీరు అనారోగ్యాలతో చనిపోయినట్లు యాజమాన్యాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. విధుల్లో చేరేటప్పుడు మెడికల్ టెస్టులు నిర్వహించాలని, ఆ తరువాత కార్మికులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని గనిశెట్టి హెచ్చరించారు.

ఎల్ఐసి ఎఓఐ మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖపట్నం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరగనున్న ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా 6వ అఖిల భారత మహా సభలను జయప్రదం చేయాలని అనకాపల్లి బ్రాంచ్ ఏఓఐ అధ్యక్షులు పెంటకోట సైదునాయుడు పిలుపునిచ్చారు. స్థానిక జీవిత బీమా కార్యాలయం ఎదుట మహాసభకు సంబంధించిన గోడ పత్రికను మంగళవారం యూనియన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గొర్లె శంకరరావు, బ్రాంచ్ సెక్రటరీ, ట్రెజరర్ కరణం మాణిక్యం రావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో కేంద్ర ప్రభుత్వం ఐపీఓ పేరుతో బీమా సంస్థను ప్రైవేటుపరం చేసే కుట్ర చేస్తుందన్నారు. దీని వల్ల సంస్థతోపాటు ఏజెంట్ల భవిష్యత్తు ఆందోళనకరంగా మారిందన్నారు. రైతు ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఏజెంట్స్ వ్యవస్థని, యల్ఐసిని పరిరక్షించుకోడానికి, భవిష్యత్తు కార్యచరణ రూపొందించేందుకు మహాసభను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 22న విశాఖపట్నంలో భారీస్థాయిలో యల్ఐసి ఏజెంట్స్, ఉద్యోగులు, పాలసీదారులతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహాసభలో కేరళ మాజీ ఆర్థిక మంత్రి థామస్ ఐజాక్, యల్ఐసి ఏఓఐ అఖిల భారత అధ్యక్షులు బాసుదేవ్ ఆచార్య, మాజీ ఎంపీ డాక్టర్ ఏ సంపత్ తదితరులు పాల్గొంటారని, ప్రతినిధుల సభను సీఐటీయూ జాతీయ కార్యదర్శి కేఎన్ ఉమేష్ ప్రారంభం చేస్తారని తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జీవిత బీమా ఏజెంట్స్ ఎన్ అప్పారావు, పీలా శ్రీనివాసరావు, రొంగలి వెంకట్రావు, ఐతా రాము, కన్నారావు,అల్లవరపు రామకృష్ణ, కొణతాల నూక అప్పారావు, ముమ్మన అప్పారావు, నరాలశెట్టి బాబూరావు, సత్యారావు, చింత సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎల్ఐసి ఏజెంట్ల సంఘం నాయకులు

గ్రంథాలయాల్లో విద్యార్థులకు పోటీలు

తాళ్లపాలెంలో బహుమతులు చూపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం కథల చెప్పడం, పాటలు, లెమన్ స్పూన్ గేమ్స్ వంటివి ఆడించారు. ఎ.ప్రవీణ్ ప్రజ్ఞాన్, ఎస్.పావని లక్ష్మీ, ఎం.వైష్ణవి, కె.భవ్య, కె.లావణ్య, పి.జోష్న ప్రియా విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.సురేష్ కుమార్, గ్రంథాలయ అధికారి కె.జగన్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం శాఖ గ్రంథాలయంలో 9వ రోజు శిబిరంలో తెలుగు, ఆంగ్లం భాషలపై లెక్చరర్ శివకృష్ణ బోధించారు. తెలుగులో అచ్చులు హల్లులతో కూడుకున్న పదాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు, 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

గొలుగొండ : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం గ్రంథాలయాధికారి రాజబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పించడం, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సిఆర్‌పి రామకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయులు సుబ్బారావు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లు శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయాధికారి కె.జనార్దన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు దేశభక్తి గీతాల ఆలాపన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజు, సిబ్బంది రవణమ్మ పాల్గొన్నారు.

కోటవురట్ల : చిన్నారులు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ అధికారి కోరారు. విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కలిగించి, పుస్తకాలిచ్చి చదివించారు.

కోటవురట్లలో పుస్తకాలు చదువుతున్న చిన్నారులు

ములగాడ : ఆట పాటలతో ఉల్లాసం, ఉత్సాహం ఉంటుందని, జీవితం పట్ల అనురక్తి పెరుగుతుందని ప్రముఖ న్యాయవాది జికెవి.రాజు అన్నారు. మల్కాపురంలోని శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆయన మంగళవారం మాట్లాడారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి, రచయిత కె.సత్తిరాజు, కార్మిక నాయకులు బి.సత్యానందం, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, రిసోర్స్ పర్సన్ లావణ్య మాట్లాడారు. అనంతరం బాలలకు కాగితాలు, చెక్కలతో వివిధ కళాకృతులను తయారుచేసే వర్క్ షాప్ నిర్వహించారు. శిబిరాన్ని స్థానిక యువకులు బాల, సిద్ధార్థ సమన్వయపరిచారు.

చిత్ర లేఖనంతో భావవ్యక్తీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : చిత్ర లేఖనం శిక్షణ ద్వారా భావవ్యక్తీకరణ చేయవచ్చని, తద్వారా సృజనాత్మకత మెరుగుపడుతుందని ఎంఇఓ డి.దివాకర్ పేర్కొన్నారు. శ్రీ గౌరీ గ్రంథాలయంలో 15 రోజుల పాటు జరిగిన ఉచిత చిత్ర లేఖనం శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ బాల్య దశ నుంచి చిత్రలేఖనం అలవరచుకోవాలని సూచించారు. చిత్ర లేఖనం కొందరికి హాబీ కాగా మరికొందరికి ప్యాషన్ అని తెలిపారు. ఒక అందమైన బొమ్మను చూస్తున్నప్పుడు కలిగే అనుభూతి వేయి వీణల సంగీతంతో సమానమన్నారు. నేవల్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ బ్యాంకు సహాయ కార్యదర్శి పెంటకోట గణేష్ మాట్లాడుతూ మదిలో మెదిలే ఆలోచనలు, ఊహాకందని ఆలోచనలకూ దృశ్య రూపం ఇవ్వడమే చిత్ర లేఖనమన్నారు. గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రంథాలయ మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, సభ్యులు మారిశెట్టి శివరామకృష్ణ, బొడ్డేడ జగ్గఅప్పారావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజేతలతో గౌరీ గ్రంథాలయం నిర్వాహకులు

విద్యార్థులతో డిఎస్‌పి సత్యనారాయణ, నిర్వాహకులు

నిరంతర శ్రమతో ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : నిరంతరం శ్రమించి చదివితే మంచి ఫలితాలు సాధిస్తారని పరవాడ డివిజన్ డిఎస్‌పి కెవి సత్యనారాయణ అన్నారు. మండలంలోని నునపర్తి శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా ప్రాంగణంలో నెల రోజులపాటు జరిగే జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. అనంతరం డీఎస్పీ సత్యనారాయణను బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాల్ బ్యాట్మెంటన్ అసోసియేషన్ మండల అధ్యక్షులు గొంప నరసింహనాయుడు, ప్రధాన కార్యదర్శి మాసవరపు అప్పారావు, సీనియర్ క్రీడాకారులు పూడి ఈశ్వరరావు, రెడ్డి కన్నమనాయుడు, యాక పైడం నాయుడు, డి శ్రీను, డి రమేష్ పాల్గొన్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

ప్రజాశక్తి - కె.కోటపాడు : బలంగా వీచిన ఈదురు గాలులకు మంగళవారం మండలంలోని శృంగవరం, మర్రివలస, గొట్లాము గ్రామాలలో మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 15 వరకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వీటితోపాటు ఉన్న కొద్దిపాటి మామిడికాయలు కూడా పూర్తిగా నేల పాలయ్యాయని మర్రివలస గ్రామ సర్పంచి పంతపల్లి అప్పల నరస తెలిపారు. ఈదురు గాలి వలన విద్యుత్ శాఖతో పాటు రైతులకు అపారమైన నష్టం కలిగిందని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలోని గ్రామ దేవత సన్యాసమ్మ ఆలయం వద్ద ఖాళీ స్థలంలో సీసీ ప్లాట్ ఫారమ్ నిర్మాణ పనులను ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ మాలిబాబు మంగళవారం గ్రామ పెద్దలతో కలిసి ప్రారంభించారు. ఈ ఆలయ అభివృద్ధి కోసం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు రూ.10 లక్షల నిధులు మంజూరు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం ధర్మకర్త వరదపురెడ్డి లలితా నాయుడు, వెలమ, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్లు సింహాచలం నాయుడు, సిమ్మ అప్పన్న, గ్రామ పెద్దలు కెవి రమణ, గుండు రాంబాబు, గొర్లె సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక అనకాపల్లి ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఆర్డీవో చిన్నికృష్ణ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి గొర్లి సూరిబాబు మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో కే ధర్మారావు, హౌసింగ్ ఏఈ యుగంధర్, గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పొరుగు సేవల సిబ్బందిని తొలగించడం అన్యాయం

ప్రజాశక్తి-దేవరాపల్లి : అటవీ శాఖలో పొరుగు సేవల సిబ్బందిని తొలగించటం అన్యాయమని సిపిఐ మండల కార్యదర్శి గరికిన రాజు పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అడవుల సంరక్షణకు వెన్నుదన్నుగా ఉండే బేస్ క్యాంపు స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బందిని తొలగించడం దారుణమన్నారు. అటవీ సంపద రక్షణకు తమ ఇంటికి, భార్య పిల్లలకు దూరంగా ఉంటూ అడవుల్లో గస్తీ కాస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాల్సింది పోయి ఇలా తొలగించడం ఏమిటని ప్రశ్నించారు.

లారీ, బస్సు యజమానులతో డిఎస్‌పి సమావేశం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ డిఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం బస్సు, లారీ ఓనర్లతో పరవాడ డిఎస్పీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు ఎలా తగ్గించాలో వివరించారు. ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పరవాడ సిఐ పి ఈశ్వరరావు, వివిధ లారీల యాజమానులు పాల్గొన్నారు.

చంద్రబాబు రోడ్ షోలను విజయవంతం చేయాలి

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18, 19 తేదీలలో మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు నిర్వహించే రోడ్ షోలను విజయవంతం చేయాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి పార్లమెంటరీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అయ్యన్న పాల్గొని ప్రసంగించారు. జగన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం అధోగతి పాలైందని భగ్గుమన్నారు. రాజకీయ పదవి కోసం సొంత చిన్నాన్నను హత్య చేయించిన ఘనత జగన్ రెడ్డిది అని పేర్కొన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగాలు అవకాశాలు లేక వారు ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు రాజశేఖరరెడ్డి, షర్మిల, జగన్మోహన్ రెడ్డి,పాదయాత్రలు చేశారని, నేడు టిడిపి నేత లోకేష్ చేస్తున్న పాదయాత్రకు అడుగడుగునా ఆటంకాలు సృష్టించడం దారుణమన్నారు. ప్రతిపక్షాలు పాదయాత్ర చేయకుండా, సమస్యలపై ప్రశ్నించకుండా, పోలీస్ యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని అనేక ఆటంకాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఈ విషయాలను ప్రజలకు వివరించాలనే ఉద్దేశంతో చంద్రబాబు 19న సాయంత్రం ఐదు గంటలకు అనకాపల్లి సుంకరమెట్టు జంక్షన్ నుండి రోడ్ షో నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు ఎస్‌వివిఎస్ఎన్.వర్మ, వంగలపూడి అనిత, పప్పల చలపతిరావు, పీలా గోవింద సత్యనారాయణ, కెఎస్ఎన్ఎస్ రాజు, టిడిపి నాయకులు బత్తుల తాతయ్య బాబు, ప్రగడ నాగేశ్వరరావు, లాలం కాశీనాయుడు పాల్గొన్నారు.

నేడు పెందుర్తిలో చంద్రబాబు పర్యటన

సబ్బవరం : ఈ నెల 17న బుధవారం పెందుర్తులో జరుగు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబు పాల్గొంటారని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని తెలుగు యువత జిలాంల అధ్యక్షులు పిబివిఎస్ఎన్.రాజు(బుచ్చిరాజు) మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన

బిజెపి ఎంపీ, మంత్రిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - పరవాడ

మహిళా క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ చైర్మన్ బ్రిజ్ భూషన్ చరణ్ సింగ్‌ను, హర్యానా మంత్రి సందీప్ సింగ్‌ను అరెస్టు చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి మాణిక్యం అధ్వర్యంలో పరవాడ సంతలో మంగళవారం క్రీడాకారులకు మద్దతుగా సంతకాలు సేకరణ చేశారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ నిందితులిద్దరిని పదవుల నుండి తొలగించాలని కోరారు. మహిళా రెజ్లర్లకు భద్రత కల్పించాలని, నిర్దిష్ట సమయంలో విచారణ పూర్తి చేయాలని కోరారు. ఢిల్లీలోని నిరసన ప్రదేశంలో విద్యుత్ తక్షణమే పునర్ధరించాలని, తాగునీరు, భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో దర్యాప్తు చేయాలని. డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం జానకి, కె రత్నం, రెడ్డి అచ్చయ్యమ్మ, వి పద్మ, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ చేస్తున్న ఐద్వా నాయకులు

ఎన్‌టిపిసిలో 'స్వచ్ఛత పక్వాడా' ప్రారంభం

ప్రజాశక్తి - పరవాడ : స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమం ఈనెల 16 నుండి 31 వరకు నిర్వహిస్తున్నట్లు ఎన్టీపీసీ సింహాద్రి యాజమాన్యం తెలిపారు. స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 6,30 గంటలకు ఎన్టీపీసీ దీపాంజలి నగర్‌లో మార్నింగ్ వాక్ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఎన్‌టీపీసీ ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ ఉద్యోగులు, దీపాంజలి నగర్ వాసులు పాల్గొన్నారు. మార్నింగ్ వాక్ ముగిసిన తర్వాత, ప్రాజెక్ట్ హెడ్ సంజయ్ కుమార్ సిన్హా స్వచ్ఛతా పక్వాడా ప్రతిజ్ఞ చేయించారు. సంజయ్ కుమార్ సిన్హా, దీపిక లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ అంజు సిన్హా బిబిపిఎస్ స్కూల్లో జిఎమ్ బాలికలకు సామూహిక స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.

భూ సర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి- దేవరాపల్లి : జగనన్న సమగ్ర భూ రీ సర్వేకు రైతులు సహకరించాలని అనకాపల్లి ఆర్‌డిఒ ఎజి.చిన్నికృష్ణ అన్నారు. మంగళవారం ఆయన తహశీల్దారు కార్యాలయంలో భూముల రీ సర్వేకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న జగనన్న సమగ్ర భూ రీ సర్వే సమయంలో వారి వారి భూమి రికార్డులు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు ఇవ్వాలని కోరారు. డివిజన్ పరిధిలో 98 గ్రామాలు ఇప్పటివరకు రీ సర్వే పూర్తయిందని, రెండో విడత 109 గ్రామాల్లో జరుగుతుందని చెప్పారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన సమస్యలు వ్యక్తిగతంగా విచారించి న్యాయం చేయడం జరుగుతుందని, వీటిలో వచ్చిన భూతగాదాలను పరిశీలన రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి- అనకాపల్లి : యోగా సాధనతో ఆరోగ్యాన్ని పొందవచ్చని ఆయుర్వేద వైద్యులు సుందర్ రాజపెరుమాళ్ళు పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 20న కోడూరు గ్రామంలో ఆరోగ్య ధాత్రి ఆధ్వర్యంలో ఏడవ సప్తాహం ప్రారంభించడం జరుగుతుందని చెప్పారు. అందులో పాల్గొనదలచిన వారు వెయ్యి రూపాయలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వారం రోజులపాటు నిరవధికంగా ఈ సప్తాహంలో పాల్గొన్న వారికి తాము చెల్లించిన వెయ్యి రూపాయలు తిరిగి చెల్లిస్తామని తెలిపారు. ఈ శిక్షణలో పలు యోగాసనాలపై శిక్షణ ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు 8519970966, 9381341454 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

వాణిజ్య పంటల పరిశీలన

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని జి.భీమవరం గ్రామంలో అనకాపల్లి జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజక్ట్ మేనేజర్ ఆర్.స్వామి నాయుడు మంగళవారం బొప్పాయి, కూరగాయలు వంటి వాణిజ్య పంటలను పరిశీలించారు. వర్షాధార పంటలకు విత్తన గులుకులు తయారు చేసి నాటిన పొలాలను సందర్శించారు. 30 రకాల నవధాన్యాల కిట్లు పరిచిలించారు. ప్రతి ఇంటి దగ్గర కిచెన్ గార్డెన్స్ వేయించాలని, దీని వల్ల ఎవరూ బయటకు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది అనిత, మండల ఇన్‌ఛార్జి ద్వారపురెడ్డి రమణ, వి.లక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-చోడవరం : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రుత్తల శ్రీరామ్మూర్తి తెలిపారు. బిజెపి విధానాలతో విసిగిత్తెన ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలో బిజెపిపై కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన సందర్భంగా చోడవరం నియోజకవర్గం కార్యకర్తల సమక్షంలో మంగళవారం విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్‌లో ఉన్న నాయకులు మళ్లీ సొంతింటికి రావడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గత నియామకాల్లో చోడవరం ప్రాంతానికి సముచిత స్థానం కల్పించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఐఆర్.గంగాధర్ మాట్లాడుతూ బిజెపి విధానాలను వ్యతిరేకించడంలో వైసిపి, టిడిపి, జనసేన విఫలమయ్యాయని ఆరోపించారు. పార్టీ నాయకులు గూనూరు వెంకట్రావు, బొడ్డు శ్రీనివాసరావు, కె.విజయ్ కుమార్, కె.అప్పారావు, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో జగన్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జగన్ రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సంక్షోభంలో పడ్డాయని బటన్ నొక్కడంలో చూపిస్తున్న శ్రద్ధ నిధులు విడుదల చేయడంలో లేదని టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పథకాలు అమలు చేసేందుకు నిధులు లేక అధికారులు చేతులెత్తేశారని పేర్కొన్నారు. కోట్లాది రూపాయలు ప్రజాధనాన్ని తన సొంత పేపర్ సాక్షికి అత్యధిక మొత్తంలో ప్రకటన రూపంలో ఇస్తున్నారని, తక్కిన పేపర్లకు తూతూ మంత్రంగా ప్రకటనలు ఇచ్చి పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికే జగన్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన ఎనిమిది లక్షల కోట్ల అప్పుల్లో 2.65 కోట్లు లక్షల కోట్ల మాత్రమే ఇచ్చి తక్కిన నిధులు ఎక్కడికి వెళ్లాయో తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

నేర నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : మండలంలోని తోటాడ సచివాలయం వద్ద మంగళవారం పోక్సో చట్టం, బాల్య వివాహాలు, స్త్రీలపై జరుగు గృహ హింస, వరకట్న వేధింపులు, యాసిడ్ దాడులు తదితర నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్రైమ్ పోలీసులు, సచివాలయ మహిళా పోలీసులు స్థానిక మహిళలకు పోక్సో చట్టం-2012పై అవగాహన కల్పించారు. వివిధ అంశాలను వీడియో ప్రజంటేషన్ ద్వారా తెలియజేశారు. అపరిచిత వ్యక్తులు కాలనీల్లో సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణానికి ఎన్ఆర్ఐ విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం పంచాయితీ శివారు పెదనాయుడుపాలెం గ్రామంలో మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణానికి టెక్కలిపాలెం సర్పంచ్ గొంప సత్యవమ్మ నాయనప్ప కుమారుడు గొంప వెంకటరమణ (ఎన్ఆర్ఐ) రూ.50 వేలు విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు ఎన్ఆర్ఐ వెంకటరమణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్కలిపాలెం మాజీ సర్పంచ్ పంచాడ శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు కిల్లి వెంకట సత్యనారాయణ, సబ్బవరపు నాగేంద్ర పాల్గొన్నారు.

డిఎస్‌పిని కలిసిన ఆర్ఆర్.నాయుడు

ప్రజాశక్తి -పరవాడ : పరవాడ సబ్ డివిజన్ డిఎస్‌పి కెవి.సత్యనారాయణను మంగళవారం కాంగ్రెస్ రాష్ట్ర ఓబిసి సెల్ ఉపాధ్యక్షులు ఆర్ఆర్ నాయుడు మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. మండలంలోని ప్రజా సమస్యలపై, భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'స్పందన' ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని గొండుపాలెం గ్రామంలో అనుమతి లేకుండా ఇటుక బట్టీలు నడపడమే కాకుండా వ్యర్థాలను దగ్ధం చేయడంతో గ్రామంలోకి పొగ వచ్చి కాలుష్యం వల్ల ఇబ్బందులు పడుతున్నామని గ్రామానికి చెందిన బడే నర్సింగరావు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, తహశీల్దారు రమేష్ బాబు మంగళవారం విచారణ చేశారు. చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఇటుక బట్టీ వద్ద విచారణ చేస్తున్న ఆర్‌డిఒ, తహశీల్దారు

సంక్షేమంలో అర్హులకు మొండిచేయి

పథకాలకు మోకాలడ్డుతున్న వైసిపి నేతలు : టిడిపి

మాట్లాడుతున్న టిడిపి నేత వేణుగోపాల్

ప్రజాశక్తి- గొలుగొండ : అర్హతే ప్రాతిపదికన సంక్షేమం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి పాలనలో, ఎఎల్.పురంలో అర్హులైనదరికో సంక్షేమ లబ్ధి అందకుండా ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్, స్థానిక వైసిపి నేతలు మోకాలడ్డుతున్నారని టిడిపి మాజీ జెడ్‌పిటిసి చిటికెల తారక వేణుగోపాల్ తీవ్రస్థాయిలో విమర్శించారు .గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఎఎల్ పురంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, గ్రామానికి చెందిన మాకిరెడ్డి రాజేశ్వరి అనే వితంతువుకు సచివాలయ కన్వీనర్ సంతకం లేదంటూ వాలంటీరు ఫించనుకు దరఖాస్తు చేయడం లేదన్నారు. పింఛను దరఖాస్తుపై పార్టీ ప్రతినిధి సచివాలయ కన్వీనర్ సంతకం ఎందుకో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు.

అలాగే ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన ధారకొండ నాగమణి అనే మహిళ ఇంటిస్థలం కోసం కలెక్టరేట్ స్పందనలో అర్జీ పెట్టుకుంటే, అర్హురాలని తహశీల్దార్ సిఫార్సు చేసే, విచారణ పేరుతో వైసిపి నేతలు ఆమెకు లబ్ధి దక్కకుండా అడ్డుకున్నారన్నారు.ఇదే గ్రామంలో 155 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తే, వారిలో 42 మంది అనర్హులే ఉన్నారని, అన్నివిధాలా అర్హురాలైన ఎస్‌సి మహిళ నాగమణికి మాత్రం ఇంటిస్థలం ఇవ్వకపోవడం విడ్డూరమన్నారు.

మేజర్ పంచాయతీలో మూడు రోజులుగా తాగునీరు లేక ప్రజలు అవస్థలు పడుతున్నా పంచాయతీగానీ, అధికారులుగానీ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. తాగునీటి పథకం మరమ్మతుకు గురైందని చేతులెత్తేసిన సర్పంచ్, అధికారులకు, టిడిపి హయాంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు చొరవతో పాత కేడీపేట నుంచి ఎఎల్ పురానికి ఉన్న మరో పైపులైన్ ద్వారా నీరిచ్చి దాహార్తి తీర్చొచ్చన్న సంగతి తెలియదా అని ప్రశ్నించారు. మూడురోజులుగా గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసి 38మందిని కరిచి గాయపరిస్తే, పంచాయతీకి పట్టకపోవడం దారుణమన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఎటువంటి సమస్యనైనా పరిష్కరించవచ్చని, వైసిపి ప్రభుత్వానికి నేతలకు లేదని అదేనని టిడిపి నేతలు విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, బొడ్డు జమీలు, రెడ్డి బుజ్జి పాల్గొన్నారు.

కొరుప్రోలులో కంటి వెలుగు పరీక్షలు

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి -ఎస్. రాయవరం : మండలంలోని కొరుప్రోలు గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు కంటి వైద్యులు బి వెంకటరావు తెలిపారు. మంగళవారం ఉదయం కొరుప్రోలు నూకాంబికా అమ్మవారి ఆలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కంటి ఆపరేషన్లకు గుర్తించిన వారిని ఈ నెల 22న శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి నేతృత్వంలో ఉచిత ఆపరేషన్లు నిర్వహించేందుకు పెనుగొల్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుండి విశాఖకు రోగులను తరలిస్తామన్నారు. ఆపరేషన్ అనంతరం వారికి ఉచితంగా కంటిఅద్దాలతోపాటు రూ.రెండు వేల నగదు ప్రోత్సాహకాన్ని ప్రభుత్వపరంగా వారి ఖాతాల్లో జమచేస్తామన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ యస్‌కె ఆషా, ఆశాకార్యకర్త గొడుగు శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీలు

ప్రపంచ డెంగీ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల అవగాహన సదస్సులు, ర్యాలీలు మంగళవారం నిర్వహించారు. ప్రతి శుక్రవారమూ డ్రై డే పాటించాలని, టైర్లు, కొబ్బరి బొండాలు, మనీ ప్లాంట్‌లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఓవర్ హెడ్ ట్యాంకులపై మూతలు పెట్టుకోవాలని నినదించారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

నక్కపల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

నక్కపల్లి : డెంగీ వ్యాధి బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎంపిడిఒ సీతారామరాజు ,వైద్యాధికారి కిషోర్ కుమార్ కోరారు. మంగళవారం నక్కపల్లిలో గొడిచెర్ల పిహెచ్‌సి వైద్యాధికారి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు..దోమలు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, ఎఎన్ఎంలు, ఎపిఒఈశ్వరరావు ,వైద్య సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.రాయవరం :మండలంలోని సర్వసిద్ధి,పెనుగొల్లు పిహెచ్‌సిల పరిధిలోని సచివాలయాల్లో మంగళవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి కె వరహాలదొర ఆదేశాలతో వైద్యాధికారులు డాక్టర్ ఎస్ఎస్ శక్తిప్రియ, డాక్టర్ ఎన్ వాసంతి, డాక్టర్ జె రాణి, డాక్టర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో డెంగీ లక్షణాలు, రాకుండా, వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మలేరియా ఇన్‌ఛార్జి నోడల్ ఆఫీసర్ పిఎన్‌వి ప్రసాద్, సిహెచ్‌ఒలు వై అనూష, రమాదేవి, లిల్లీ ఆశిషెన్, టోపో సచివాలయం హెల్త్ సెక్రటరీలు రాజేశ్వరి, పి.నూకరత్నం, పి శ్రీరాములు, హెచ్ ఇ శ్రీనివాసరావు, ఆదినారాయణమూర్తి, హెల్త్ అసిస్టెంట్లు జావీద్, ఎఎనఎం డాలి, మణిమాలతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటవురట్ల : జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా అన్నవరం, బికె పల్లి, ఎండపల్లి, తంగేడు, కోటవురట్ల ,లింగాపురం, సహా పలు గ్రామాలలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు, డాక్టర్ సంతోష్ డెంగీ లక్షణాలు,తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంటిపరిసరాల్లో నీరు నిల్వ లేకుండా, దోమలు కుట్టకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, హెల్త్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యాధికారిలు డాక్టర్లు ధీరజ్, వై యశోద ఆధ్వర్యంలో డెంగీపై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమతెరలు వాడాలని సూచించారు. విజయలక్ష్మి, సత్యవతి, సత్యనారాయణ, సుభానీ, గుప్తా పాల్గొన్నారు.

అనకాపల్లి : డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వాణి జగదీశ్వరి పేర్కొన్నారు. డాక్టర్ వాణి జగదీశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ర్యాలీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డి శారద, ఎంపిహెచ్ఈఓ జె.శ్రీనివాసరావు, ఎంపిహెచ్ఎస్ బి సంగం, ఎం మరియమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా డెంగ్యూను నివారించవచ్చని తుమ్మపాల సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు అన్నారు. గ్రామపంచాయతీలో మంగళవారం డెంగ్యూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈవో శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ చదరం చిన్న, సచివాలయం సెక్రటరీలు ఫణి, సి సత్యనారాయణ, ఏఎన్ఎంలు జయలక్ష్మి, రాజేశ్వరి, ఎంఎల్ హెచ్పిలు వై భాను, శ్రీ నివేదిత, ఆర్. ప్రియదర్శిని పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి డాక్టర్ అనిల్ కుమార్, ఆరోగ్య సిబ్బందితో కలిసి గ్రామంలో పలు వీధులలో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఉపాధి హామీ కూలీలను కలిసి డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సర్పంచ్ దిమ్మల అప్పారావు, మండల వైసీపీ కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు, ఎంపీడీవో రవికుమార్, ఈవోపీఆర్ డి ఈశ్వరరావు, సిహెచ్ఓ ఆర్ దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం ఉమా మహేష్, బిఎస్ఎన్ లక్ష్మి, ఏఎన్ఎం దేవకి, మహిళా పోలీసులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురంలో వైద్యాధికారి బి.అలేఖ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె వేణుగోపాల్, ఆరోగ్య పర్యవేక్షక అధికారి ఎరుకునాయుడు, హెల్త్ అసిస్టెంట్ లండా ఆవలకొండ, శ్రీనివాసరావు, ఎస్.అప్పల నాయుడు, లలిత, వరలక్ష్మి, గీతా రాణి పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలంలో 18 సచివాలయాల పరిధిలో డెంగీపై అవగాహన సదస్సు, ర్యాలీలు నిర్వహించారు. లోడగలవానిపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఎండిఒ లోవరాజు, పిహెచ్‌సి వైద్యాధికారి కె.శైలజ హాజరై డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ షహనాజ్, ఇఒపిఆర్‌డి ఆంజనేయులు, హెల్త్ సూపర్వైజర్లు కృష్ణవేణి, ఐ.గోవిందరావు, సన్యాసిరావు, కల్యాణమ్మ, భవాని, స్వరాజ్యం, సెక్రటరీలు మూర్తి, అనురాధమ్మ, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెందుర్తి : పెందుర్తి మండల ప్రజా పరిషత్తు కార్యాలయం సిబ్బంది ఆధ్వర్యాన పిహెచ్‌సి సిబ్బంది, అంగన్‌వాడీ, వెలుగు సిబ్బంది కలిసి పెందుర్తిలో డెంగీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి ఎంపిపి మధుపాడ నాగమణి, ఎంపీడీవో వెంకటరావు, పిహెచ్‌సి వైద్యాధికారి గిరిష్మా, సిహెచ్‌ఒ వై.స్వర్ణలత, వైద్య సిబ్బంది ఎస్‌వి.రమణ, డి.కొండలరావు, పలువురు ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వెలుగు ఎపిఒ రమణ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.రామకృష్ణ కోరారు. డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాజువాక మెడికల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ములగాడ : 61వ వార్డు పరిధి మల్కాపురంలో జివిఎంసి బయాలజిస్ట్ చక్రవర్తి పర్యవేక్షణలో మలేరియా విభాగం ఆధ్వర్యాన డెంగీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఇన్‌ఛార్జి దాడి సత్యనారాయణ, వార్డు వైసిపి అధ్యక్షులు జివిఎస్ఎన్.రాజు, మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్, జిల్లా మలేరియా విభాగం హెల్త్ అసిస్టెంట్లు రాజ్‌కుమార్, రోమాల వేణుబాబు, మలేరియా సూపర్ వైజర్లు విజయ కృపామణి, శ్రీనివాస్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : రేవిడి పిహెచ్‌సి ఆధ్వర్యాన మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ డెంగీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపిపి రాంబాబు, వైద్యాధికారి స్వప్న, ఎంపిడిఒ ఎం.విజయకుమార్ పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, కార్పొరేటర్ కెల్ల సునీతసత్యనారాయణతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, జివిఎంసి ఆరోగ్య సిబ్బంది, మలేరియా సిబ్బంది, ఆర్‌పిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాకలో డెంగీపై అవగాహన సదస్సు

ఎస్.రాయవరంలో నిర్వహిస్తున్న ర్యాలీ

కాలనీకి వెళ్లే దారేదీ?

అసంపూర్తి వంతెనతో అవస్థలు

ఇళ్ల లబ్ధిదారులు ఇక్కట్లు

పట్టించుకోని అధికారులు, నేతలు

అసంపూర్తిగా వదిలేసిన కల్వర్టు నిర్మాణం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో తుపాకీగెడ్డ సమీపంలో ప్రభుత్వం నిర్మాణం చేపడుతున్న కాలనీ ఇళ్లకు దారి లేకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు, ఇక్కడ నిర్మిస్తున్న ఇళ్లకు ప్రభుత్వం తుపాకీ గడ్డపై వంతెన నిర్మాణం చేపట్టింది, వంతెన నిర్మాణం అసంపూర్తిగా వదిలివేయడంతో ఆయా ప్రాంత వాసులు సహా సమీపంలో ఇళ్లు నిర్మిస్తున్న కాలనీ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, ఇళ్ల నిర్మాణాల కోసం సామగ్రిని తరలించేందుకు ఇటీవల మండల పరిషత్ కార్యాలయం గోడ కూల్చి దారి ఏర్పాటు చేశారు, అయితే కార్యాలయ అధికారులు కూల్చిన గోడను తిరిగి కట్టేయడంతో లబ్ధిదారులు కాలనీకి వెళ్లే దారి లేక అవస్థలు పడుతున్నారు. నిర్మించిన వంతెన అప్రోచ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది, సంబంధిత కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణాలు ఆపివేసినట్లు లబ్ధిదారులు వాపోతున్నారు,. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీకి వెళ్లే దారి చూపాలని కోరుకుంటున్నారు.

ఘనంగా గణపతి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి రాజీవ్ నగర్ కాలనీలోగణపతి ఆలయ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం కాలనీ వాసులు ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు.పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు.

పుస్తక పఠనంతో బహుళ ప్రయోజనం

విద్యార్థులకు కథలు చెబుతున్న ఆచార్యులు

ప్రజాశక్తి- నక్కపల్లి : చదువులో రాణిస్తే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు ఉంటుందని తెలుగు ఉపాధ్యాయులు ఎన్‌విఎస్ ఆచార్యులు అన్నారు. మంగళవారం మండలంలో రాజయ్యపేట హైస్కూలులో ప్రధానోపాధ్యాయులు బిఆర్.అప్పారావు ఆధ్వర్యంలో చిన్నారులతో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో పంచతంత్రం కథలను చదివించి వారిచే స్వంతమాటల్లో చెప్పించారు. అనంతరం మాట్లాడుతూ సమగ్రశిక్షా ఆధ్వర్యంలో పాఠశాలల్లో అందుబాటులో ఉన్న కథల పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొంతకాలంగా అమలవుతున్న చదవడం మాకిష్టం కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. నీతి, మానవీయ విలువలను తెలుసుకోవడం ద్వారా వారి భవితకు ఉపయోగపడుతుందన్నారు. కథలు చదవడం ద్వారా జ్ఞానసముపార్జన కలుగుతుందన్నారు. విజ్ఞానమే విద్యార్థి ప్రగతికి కొలమానమని, ఒత్తిళ్లకు దూరం కావచ్చని, కథల వలన బహుళ ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు.

ప్రజారోగ్యానికి పొగ!

- డంపింగ్ యార్డులుగా గ్రామాల ముఖద్వారాలు
- పేరుకుపోయిన చెత్త దగ్ధంతో ప్రజల అవస్థలు
- చోద్యం చేస్తున్న అధికారులు

తంగేడులో రోడ్లను కమ్మేసేలా చెత్తాచెదారం నుంచి వెలువడుతున్న పొగ

ప్రజాశక్తి - కోటవురట్ల: మండల వ్యాప్తంగా దాదాపుగా అన్ని గ్రామాలలోనూ ముఖ ద్వారాల వద్ద రోడ్డుకు ఇరువైపులా డంపింగ్ యార్డులను తలపించే విధంగా చెత్త,ప్లాస్టిక్ వ్యర్థాలను తరలించి దగ్ధం చేయడంతో ప్రజలు వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థాలను కాల్చేయడం వల్ల వచ్చిన పొగతో ప్రయాణికులు సహా ఆయా ప్రాంత వాసులు ఉక్కిరిబిక్కిరి అయ్యే పరిస్థితి ఉంది. జిల్లా స్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించి సంపద కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని చెబుతున్నారే కానీ, ఎక్కడ వాటిని వినియోగంలో తీసుకువచ్చిన దాఖలాలు కనిపించలేదు, చాలా గ్రామాలలో సంపద సృష్టి కేంద్రాలు నిర్మించినా, వాటిని అందుబాటులోకి తీసుకురాక పోవడం, వాటి వినియోగంపై పంచాయతీలు, అధికారులకు చిత్తశుద్ధి, ఆసక్తి లేకపోవడంతో అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. దీంతో గ్రామాల్లోని చెత్త అంతా గ్రామ ముఖ ద్వారాలకు చేరుతుండగా, రోజురోజుకూ పెరిగిపోతున్న చెత్త గుట్టలను తగలబెట్టడంతో దాని ద్వారా వచ్చే కర్బన ఉద్గారాల వల్ల పలు రకాల శ్వాస కోస సంబంధిత వ్యాధులు సంభవించే అవకాశం ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు, అంతేకాక దట్టంగా కమ్ముకున్న పొగతో వాహనదారులు, పాదచారులకు రోడ్డు సక్రమంగా కనిపించక ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి, నేటికీ కొన్ని గ్రామాలలో రోడ్లకు ఇరువైపులా బహిరంగ మలవిసర్జన చేస్తూ ఉండడం పట్ల దుర్గంధం వెదజల్లడంతో ముక్కు మూసుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. దాదాపు అన్ని గ్రామాలలో సచివాలయ వ్యవస్థలో పదిమంది సిబ్బంది, 20 నుంచి 40 వరకు వాలంటీర్లు ఉన్నా, గ్రామంలో పారిశుధ్యం మెరుగునకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పూడుకుపోయిన డ్రైనేజీలతో అవస్థలు

అంతేకాక గ్రామీణ ప్రాంతాల్లో డ్రైనేజీలు పూడుకుపోవడం, చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి, అస్తవ్యస్తంగా తయారు కావడంతో దోమల బెడద అధికంగా ఉంది, రోడ్లపై మురికి నీరు ప్రవహిస్తున్న నిధుల లేమి కారణంగా పంచాయతీలు, అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది, సంబంధిత ఉన్నత అధికారులు ,సిబ్బంది ఇప్పటికైనా స్పందించి ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతావాసులు కోరుతున్నారు.

సీతారామరాజు నగర్‌లో చెత్తాచెదారంతో పూడుకుపోయిన డ్రెయినేజీ...

రోడ్డుపైన, అంచుల్లోనే పారుతున్న మురుగునీరు

నవజాత శిశువుల సంరక్షణ యూనిట్ ప్రారంభం

ఎస్ఎన్‌సియును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ : స్థానిక ఏరియా ఆసుపత్రిలో నవజాత శిశువుల సంరక్షణ ప్రత్యేక యూనిట్ (ఎస్ఎన్‌సియు) ను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మంగళవారం ప్రారంభించారు. రూ. 36 లక్షలతో ఈ యూనిట్‌ను 10 పడకలుగా విస్తరించారు. ఇందులో ఐబియు, ఓబియు, మదర్ ఫీడింగ్ రూమ్, లేబరేటరీ తదితర సౌకర్యాలను విస్తరణలో మెరుగుపరిచారు. అనంతరం రక్తనిధి సేకరణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, నవజాత శిశువుల సంరక్షణకు ఆసుపత్రిలో పడకలు సరిపోక అసౌకర్యంగా ఉండేదన్నారు. ఇప్పుడైతే 10 పడకలు అదనంగా విస్తరించడం, అత్యాధునిక సౌకర్యాలు కల్పించడం ద్వారా ఏరియా ఆసుపత్రిలో నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణకు పూర్తి సౌకర్యాలు ఏర్పడ్డాయన్నారు. రూ 8.85 కోట్లతో నిర్మిస్తున్న మూడు అంతస్తుల అవుట్ పేషంట్ తదితర విభాగాలతో కూడిన భవనాన్ని జూన్ లేదా జూలై నెలలో ప్రారంభిస్తామన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీలో వైద్య సౌకర్యాలు మెరుగుపరచడం కోసం రూ.14 కోట్ల 89 లక్షలు ఇప్పటికే ఖర్చు చేశామన్నారు.

రూ.1.60 కోట్లతో నిర్మించిన గవర వీధి, బలిఘట్టంలోని రెండు అర్బన్ పిహెచ్‌సిలను కూడా త్వరలో ప్రారంభించనున్నామన్నారు. ఈ సందర్భంగా అత్యున్నత వైద్యం అందిస్తూ, ఏరియా ఆసుపత్రిని సేవలలో అగ్రభాగాన నిలిపిన వైద్యులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డిసిహెచ్ డాక్టర్ శ్రావణ్ కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి దేవి, వైసీపీ నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా మోదమ్మ అనుపోత్సవం

- కిక్కిరిసిన పాడేరు ప్రధాన రహదారి
- కట్టిపడేసిన సాంస్కృతిక కార్యక్రమాలు
- భద్రతకు పటిష్ట పోలీసు బందోబస్తు
- అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

అనుపోత్సవంలో విగ్రహం, పాదాలు మోస్తున్న ఐటిడిఎ పిఒ, ఎమ్మెల్యే,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మన్యం ప్రజల ఆరాధ్యదైవం మోదకొండమ్మ జాతర మూడు రోజుల పాటు ఘనంగా జరిగింది. తొలి రోజు ఆదివారం ఉత్సవ విగ్రహం, అమ్మవారి పాదాలను ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకు వచ్చి శతకంపట్టు వద్ద కొలువు తీర్చడంతో ఉత్సవాలు ఆరంభం అయ్యాయి. శతకంపట్టు వద్ద కొలువుదీర్చిన ఉత్సవ విగ్రహం అమ్మవారి పాదాలను తిరిగి ఆలయానికి చేర్చడంతో ఉత్సవాలు ముగిశాయి. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ ఉత్సవాలకు ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర ముగింపు సందర్భంగా మూడో రోజు మంగళవారం సాయంత్రం శతకంపట్టు వద్ద నాలుగున్నర గంటల తర్వాత ప్రారంభమైన అనుపోత్సవానికి భక్తులు పోటెత్తారు. శతకంపట్టు నుంచి మోదకొండమ్మ ఆలయం వరకు ఉత్సవ విగ్రహం, పాదాలు ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పిన్నయ్యదొర, తదితరులు అమ్మవారి విగ్రహం, పాదాలను తలకెత్తుకుని అనుపోత్సావాన్ని ప్రారంభించి ముందుకు సాగారు. శతకంపట్టు నుంచి సుండ్రుపుట్టు సాయిబాబా గుడి, మెయిన్ రోడ్డు, అంబేద్కర్ కూడలి మీదుగా మోదకొండమ్మ దేవాలయం వరకూ ఊరేగింపు సాగింది. అమ్మవారి పాదాలను తలపైకి ఎత్తుకునేందుకు, తాకేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఉత్సవాల ఆఖరి రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. డప్పులతో తరలి వచ్చి అమ్మవారికి ఘటాలు సమర్పించుకున్నారు. డప్పు కళాకారులు, ఊరేగింపులో వివిధ వేషధారణలు, విన్యాసాలు, బ్యాండ్ లు, తప్పెట గుళ్ళు, నేల వేషాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. శాంతిభద్రతల సమస్యలు లేకుండా, తొక్కిసలాట జరగకుండా పోలీసులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఉత్సవాల మూడు రోజులు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారీగా బాణసంచా కాల్చారు. అనుపోత్సవ కార్యక్రమంలో జెసి జె.శివ శ్రీనివాసు, ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవ, ఎఎస్‌పి ధీరజ్ కునుబిల్లి, స్థానిక సిఐ బి.సుధాకర్, ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ టి.నర్సింగరావు, సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, ఉప సర్పంచ్ బూరెడ్డి రాము నాయుడు, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు కొట్టగుల్లి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శులు ఎన్.కొండబాబు, టి. ప్రసాదరావు నాయుడు పాల్గొన్నారు.

జాతర జరిగిందిలా..

మోదకొండమ్మ ఉత్సవాలు మూడు రోజులు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ, ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేశారు. తొలి రోజు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్‌టి కమిషన్ చైర్మన్, ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, మాజీ ఉపముఖ్యమంత్రి, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి, ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, జడ్‌పి చైర్మన్ జల్లిపల్లి సుభద్ర, ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ టి.నరసింగరావు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ప్రముఖులను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో సత్కరించి అమ్మవారి చిత్రపటాలను బహుకరి ంచారు. ఎస్‌పి అతుల్ సిన్హా, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, పాడేరు, చింతపల్లి ఎఎస్‌పిలు ధీరజ్ కునుబిల్లి, కిషోర్, ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవ, టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో వందలాదిగా పోలీసులు పహారా కాసారు.

పట్టు వస్త్రాలు, పసుపు కుంకుమ సమర్పణ

పాడేరు టౌన్: మోదకొండమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకుని టిటిడి తరపున ఆలయ చైర్మన్, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి , డాక్టర్.టి.నరసింగరావు దంపతులు, ఉమ్మడి విశాఖ జడ్‌పి చైర్మన్ జల్లిపల్లి సుభద్ర, మూర్తి దంపతులు పట్టు వస్త్రాలు పసుపుకుంకుమ సమర్పించారు. ఈ సందర్భంగా వారు టిటిడికి, సిఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆలయ ప్రధానకార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు, రమాదేవి దంపతులు పాల్గొన్నారు.

అనుపోత్సవంలో జనాలతో కిక్కిరిసిన పాడేరు ప్రధాన రహదారి

ముగింపు వేడుకలో సాంస్కృతిక కార్యక్రమాల సందడి